క్లుప్తంగా

రైతులకు అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

తిమ్మాపూర్: మండలంలోని రైతులకు పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో సురేందర్ తెలిపారు. జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్‌నంబర్ తీసుకొని రావాలని సూచించారు. జీలుగ బ్యాగ్ 30 కేజీ రూ.1,116, 40 కిలోల జనుము బ్యాగ్ రూ.1,448 నిర్ణయించినట్లు తెలిపారు.

హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం



నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆదివారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత పాలకవర్గాన్ని రద్దు చేసి నూతన అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ కన్వీనర్‌గా గడ్డం ధర్మారెడ్డిని, కో కన్వీనర్లుగా కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ, సభ్యులుగా పత్తి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీధర్, వేల్పుల సునీల్, పోతరాజ్ సంపత్, చిట్టంపల్లి సృజన్, శ్రీనివాస్, చిలుకమారి సత్యరాజ్, మచ్చిక చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు మామిడి రవీందర్, తిరునగరి ఆంజనేయస్వామి, కోరం సుధాకర్‌రెడ్డి, కేసిరెడ్డి నరసింహారెడ్డి, పరాంకుశం కిరణ్‌కుమార్ ఉన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



జేసీబీ వద్ద గ్రామస్తులు

మానకొండూర్: మండలంలోని రాఘవపూర్ సమీపంలో జవారికుంట నుంచి కొందరు వ్యాపారులు అక్రమంగా మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. కొద్దిరోజులుగా మట్టి వ్యాపారులు, జేసీబీ సహాయంతో మట్టిని కరీంనగర్ పట్టణానికి గుట్టు చప్పుడుగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా ఆదివారం రాఘుపూర్ గ్రామస్తులు మట్టి తరలింపును అడ్డుకొని అధికారులకు సమాచారం అందించారు.

నాంచారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎరుకుల కులస్తులు

హుజూరాబాద్: పట్టణంలోని ఏకలవ్య కాలనీలో ఆదివారం తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కూతాడి కుమారస్వామి ఆధ్వర్యంలో ఎరుకల నాంచారమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కూతాడి శ్రీనివాస్ మాట్లాడుతూ... 23న వైశాక శుద్ధ పౌర్ణమి రోజు ములుగు జిల్లాలోని రామాంజపురం గ్రామంలో ఎరుకల నాంచారమ్మ జాతరను అంగరంగ వైభవంగా జరపనున్నట్లు తెలిపారు. జాతరకు నాలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

'మురుగునీటితో ఇబ్బంది పడుతున్నాం'

వీణవంక: మండల కేంద్రంలోని 9వ వార్డులో డ్రైయినేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆరోపించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా ఉన్న డ్రైయినేజీని తొలిగించడం వల్ల డ్రైయినేజీ నిండి ఇళ్లలోకి మురుగు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరునెలలుగా గోస పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సైడ్ డ్రైయినేజీలు నిర్మించి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బోనమెత్తిన పల్లెలు

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య పోచమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీమానసాదేవి ఆలయ వార్షికోత్సవాలు

మండలంలోని ఖాసీంపేట గ్రామంలో శ్రీమానసాదేవి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అర్చకులు పెండ్యాల అమర్‌నాథ్‌శర్మ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య పోచమ్మతల్లి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అందరినీ సల్లంగచూడు తల్లి అంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పత్తెం వీరాస్వామి, తాజామాజీ సర్పంచ్ పత్తెం రమేశ్, మండల ఉపాధ్యక్షుడు చిట్టంపల్లి శ్రీనివాస్, తులాయిల కనుకయ్య, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి సుంకరి శ్రీనివాస్, జర్నలిస్టులు పత్తెం శ్రీనివాస్, రమేశ్, ఆకుల రాజు, బొగ్గుల సంతోష్, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, సత్యం, రాయమల్లు, రవీందర్, వెంకటయ్య, సాయిరెడ్డి, అశోక్ పలువురు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: నర్సింగాపూర్‌లో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

తిమ్మాపూర్: మండలంలోని పొలంపల్లి , నర్సింగాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఇంటికో బోనంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వంటలు వండి సహపంక్తి భోజనం చేశారు. సకాలంలో వర్షాలు కురవాలని పిల్లాపాపలు పాడిపంటలతో ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. వేడుకల్లో గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నలగొండ తిరుపతి గౌడ్, సినీ నిర్మాత కీర్తి లతాగౌడ్, మండల అధ్యక్షుడు పడాల నరసింహులు, బొడిగె కొమురయ్య, ఎంపీటీసీ బండారి రమేశ్, మాజీ సర్పంచులు బుడిగె కొండయ్య, పర్శరాంగౌడ్, మూల అరుణ్, దశరథం, ఐలయ్య, శ్రీనివాస్, కుమార్, రమేశ్, అర్జున్, రాజమల్లు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారామచంద్రస్వామి కల్యాణం

శంకరపట్నం: మండలంలోని ముత్తారం సీతారామచంద్రస్వామి కల్యాణం ఆదివారం రాత్రి ఆలయం కల్యాణ మండపంలో వేదపండితులు రాఘవాచార్యులు, బాలాజీచార్యుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని ముత్తారం, ఏరడపల్లి, కేశవపట్నం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి తిలకించారు.



చిగురుమామిడి మండలం సుందరగిరిలో డప్పుచప్పుళ్ల మధ్య...



గన్నేరువరం: మాదాపూర్‌లో...



గన్నేరువరం: శ్రీమానసాదేవి ఆలయంలో పూజలు




శంకరపట్నం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ధరలు మూడింతలు..

- కొండెక్కిన మామిడికాయ పచ్చడి ముడి సరుకుల ధరలు
- బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు

హుజూరాబాద్‌రూరల్: ఆవకాయ పచ్చడికి పేద, ధనిక అనే తేడా ఉండదు. ప్రతి సీజన్‌లో కుటుంబాలకు సరిపడా తగిన మోతాదులో ఇంటి వద్ద పచ్చడి తయారు చేసుకుంటారు. చాలా మంది ఇళ్లల్లో సంవత్సరం పొడవునా పచ్చడి ఉంటుంది. ఇలా అందరూ ఇష్టపడే పచ్చడి ప్రియం అవుతోంది. ఈ ఏడాది మామిడికాయ ధరలు మూడింతలు పెరిగాయి. నూనె, ఇతర ముడి సరుకుల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో పచ్చడి తయారీ సామాన్యులకు మరింత భారంగా మారింది. గతంలో కిలో రూ.40-60 పలికిన మామిడికాయల ధర ఈ ఏడాది రూ. 130 నుంచి 150 పెరిగింది. వివిధ రకాలు నూనెలు, వెల్లుల్లి, ఎండుమిర్చి ధరలు నాణ్యతను బట్టి వందలపైనే పలుకుతున్నాయి. ప్రస్తుతం రెండున్నర కిలోల పచ్చడి తయారీకి సుమారు రూ. వెయ్యి వరకు ఖర్చు అవుతుంది. సాధారణంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ చివరి వరకు మామిడి కాయ పచ్చడి పెడుతుంటారు. చిన్న రసం, తెల్ల గులాబీ, జలాలు, నాటు రసాలు, నాటు మామిడికాయలు, మల్లెకలు వంటి రకాలను వినియోగిస్తారు. ప్రస్తుతం తెల్ల గులాబీ, జలాలు, నాటు రకాలు, మల్లికలు అందుబాటులో ఉన్నాయి. ఇవి జూన్ వరకు లభిస్తాయి. ముక్కలు చేసినందుకు కిలో రూ. 20 వరకు తీసుకుంటారు. ఎండు మిరపకాయల ధర కిలో రూ. 350 వరకు ఉన్నాయి.



ధరలు పెరిగాయి



ఈ ఏడాది మామిడికాయల ధర మూడు రెట్లు పెంచారు. నూనె, వెల్లుల్లి ధరలు పెరిగాయి. ఇది సామాన్యులకు కొంత భారంగా మారింది. నాణ్యమైన సరుకులతో ఇంటి వద్ద తయారు చేసే పచ్చడి రుచి, శుచిగా ఉంటుంది. అన్నివర్గాల వారు ఆవకాయ పచ్చడిని ఇష్టంగా భావించి వినియోగిస్తారు.

– గంగారాపు రాజేశ్వరి, గృహిణి, కాట్రపల్లి

పచ్చడంటే ఇష్టం..



ఆవకాయ పచ్చడిని మహాలక్ష్మీ, అన్నపూర్ణగా భావిస్తాం. పచ్చడిని స్వయంగా జాగ్రత్తగా తయారు చేస్తాను. ఏటా ఎక్కువ మోతాదులో తయారు చేసి బంధువులు, స్నేహితులకు అందజేస్తా. ఏడాది పొడవునా ఇంట్లో వినియోగిస్తాం. పచ్చడి తయారీకి సరుకుల ధరలు బాగా పెరగడం ఇబ్బందిని కలిగిస్తోంది.

– కుర్ర రజిత, గృహిణి, ఇప్పలనర్సింగాపూర్

హామీలు నెరవేర్చకుండా కాలయాపన

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం విస్మరించిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంత వరకూ చేయలేదన్నారు. ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామంటూ కాలయాపన చేస్తున్నాడని హేళన చేశారు. అలాగే క్వింటాల్‌కు రూ.ఐదు వందలు బోనస్ ఇప్పటి వరకూ ఇవ్వలేదన్నారు. వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడిసిపోయిందని, ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ ఆరోపించారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర ల సమావేశంలో మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు రైతుల కల్లాలను పరిశీలించించినట్లు తెలిపారు. రైతుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పి హామీని విస్మరించిందన్నారు. రైతులు వానాకాలం పంటకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పెట్టుబడి సాయం అందించాలని,కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసిన తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని కోరారు.



జమ్మికుంట: మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మాయమాటలతో మోసం చేస్తుందన్నారు. ఎలాంటి కోతలు లేకుండా రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరుగ్యారంటీల పేరిట అమలు కానీ హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమీక్షల పేరిట మోసం చేస్తూ తప్పించుకుంటున్నారని, ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఆచరణసాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం దొడ్డి దారిన అధికారం చేజిక్కించుకున్నదని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ఎప్పటిలోగా అమలుచేస్తుందో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో కల్లాలో ఉన్న ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతుంటే రైతుల, ప్రజల సంక్షేమం గాలికొదిలేసి సీఎం రేవంత్‌రెడ్డి పక్క రాష్ట్రాల పర్యటనకు వెళ్లడం విడ్డూరంగాఉందన్నారు. రైతులకు బోనస్ ఇవ్వకపోవడం పట్ల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు.

చిగురుమామిడి: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటి రెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని రేకొండ గ్రామంలో బీజేపీ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. బీజేపీ మండల కో ఆర్డినేటర్ ప్రదీప్, మండల ఉపాధ్యక్షుడు శంకర్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

తిమ్మాపూర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సుగూర్తి జగదీశ్వరాచారి అన్నారు. తిమ్మాపూర్‌లో ఆదివారం మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల రైతులు నష్టపోతున్నారని, ఇటీవల అకాల వర్షాలతో మండలంలో జరిగిన నష్టంపై ఎటువంటి అంచనా వేయలేదని, తడిసిన ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. కూలిన ఇళ్లతోపాటు పశువుల కొట్టాలకు, రేకుల ఇళ్లకు ఆర్థికసాయం అందించేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని, సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు. రైతుల పెద్ద సంఖ్యలో తరలిరావాలని, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజల సంక్షేమం కోసం ఆలోచించేది బీజేపీ మాత్రమేనని అందుకే బండి సంజయ్ రైతుల విషయంలో దృష్టి సారించారని తెలిపారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర అనిల్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కంది రాజేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, తొర్తి సంతోష్, పబ్బ తిరుపతి, రామిడి మహేందర్ రెడ్డి, పోరెడ్డి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్వరాచారి

టీఎస్ఈఏపీసెట్‌లో మెరిసిన పేదింటి విద్యార్థి

జమ్మికుంట: నిరుపేద కుటుంబానికి చెందిన మర్రి అభినవ్ అనే విద్యార్థి శనివారం ప్రకటించిన టీఎస్ఈఏపీసెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయిలో 516 ర్యాంకుసాధించాడు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు రామన్నపల్లి గ్రామానికి చెందిన మర్రి శ్రీనివాస్, మంగ దంపతులు కుమారుడు అభినవ్‌ది నిరుపేద కుటుంబం. కాగా తండ్రి శ్రీనివాస్ వ్యవసాయం చేసుకుంటూ జమ్మికుంటలోని నీలకంఠ ఫ్యాన్సీ క్లాత్ షోరూంలో పనిచేస్తూ కుమారుడిని చదివించాడు. జమ్మికుంటలో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. కష్టపడి చదువుకొని మంచి ర్యాంక్ సాధించిన అభినవ్‌ను నీలకంఠ ఫ్యాన్సీ క్లాత్ షోరూం యాజమాని వేణు, గ్రామస్తులు అభినవ్‌ను అభినందించారు.



తల్లిదండ్రులతో అభినవ్

ఘనంగా మోహినీ ఏకాదశి ఉత్సవాలు

కరీంనగర్‌కల్చరల్: తిరుమల నగర్‌లోని మయూరగిరి పీఠం శ్రీ నిలయంలో మోహినీ ఏకాదశి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్య స్వామి ఆధ్వర్యంలో ఉదయం లక్ష్మీనారాయణ స్వామికి ఫల పంచామృత అభిషేకం, అష్టోత్తర ఆరాధన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అష్టాక్షరి మూలమంత్ర సహిత లక్ష్మీనారాయణ హోమం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఏకాదశి నాడు నారాయణమూర్తిని ఆరాధించడం వల్ల సకల పాపాలు తొలగి, మనశ్శాంతి కలుగుతుందన్నారు.

గుండెపోటుతో ఒకరి మృతి



మహేందర్(ఫైల్)

హుజూరాబాద్: పట్టణంలోని కాకతీయకాలనీకి చెందిన అల్లి మహేందర్ (58)(ఎల్ఐసీ హుజూరాబాద్ బ్రాంచ్ మేనేజర్) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. ఛాతిలో నొప్పిగా ఉందనడంతో హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతిపట్ల ఎల్ఐసీ ఏజెంట్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు సంతాపం తెలిపారు.

ప్రమాదకరంగా పైపులైన్ గొయ్యి

ప్రమాదాల బారిన వాహనదారులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ నుంచి వెల్ది వెళ్లే మార్గంలో గ్రామంలో నీటి సౌకర్యం కోసం కొద్దిరోజుల క్రితం పైప్‌లైన్ పనులు చేపట్టారు. పైపులు అమర్చిన అనంతరం మట్టితో గొయ్యిని పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో దారి గుండా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగు రోజుల్లో ఎనిమిది మంది వాహనదారులు ప్రమాదానికి గురయ్యారని ప్రయాణికులు తెలిపారు. అధికారులు తక్షణమే పైపులైన్ గుంతను పూడ్చి వేయాలని కోరుతున్నారు.





మానకొండూర్: వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 పదో తరగతి విద్యార్థులు



గన్నేరువరం 2006-07 పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు.. పాఠాలు భోదించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సాయంత్రం వరకు అందరు సంతోషంగా గడిపారు.

గన్నేరువరం: గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2006-07 పదో తరగతి విద్యార్థులు మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.